



**సహజ పయనిస్తున్న ఖరీదైన కారు మెల్లగా హుందాగా ఆగింది. ఎప్పుడూ మోడరన్ దుస్తుల్లో అత్యాధునికంగా అలంకరించుకునే సహజ సాదా నూలు చీరలో వదులు జడ వేసుకొని కాళ్ళకు మామూలు చెప్పులు వేసుకొని వుంది.**

తన ఒడిలోనున్న అతి ఖరీదైన ఫారిన్ కెమెరా, కళ్ళకున్న కూలింగ్ గ్లాసెస్, మెడలోనున్న డాలర్ చైను తీసి పక్కనున్న స్నేహితురాలికిచ్చింది. సహజ ఇప్పుడు మధ్య తరగతికి చెందిన అమ్మాయిలా ఉంది.

సహజ కారులోంచి దిగుతూ "రెండు గంటలు అనవసరం అనుకుంటాను. బహుశా ఒక్క గంట లోపునే వస్తాను. ఇక్కడే ఉండండి" అంది.

రోడ్డుమీద నుండి హాస్పిటల్‌కు వేగంగా నడవసాగింది సహజ. హాస్పిటల్‌లో ప్రవేశించి "డాక్టర్, నేను రక్తదానం చెయ్యడానికి వచ్చాను అంది.

"అదిగో అటు వెళ్ళండి" విసుగ్గా అన్నాడు. అంతలోనే ఆ డాక్టరుకు ఓ చిన్న అనుమానం. "మీదే గ్రూపు" అడిగాడు.

"బి- నెగెటివ్" అంది సహజ.

డాక్టరు ముఖంలో ఆనందరేఖ తళుక్కు మంది. నర్సును పిలిచి "సిస్టర్, ఈమె రక్తం బి- నెగెటివ్ గ్రూప్. వెంటనే ఈమెను లాబ్‌కు తీసుకొని వెళ్ళి రక్తపరీక్ష చేయించి రిపోర్టు తీసుకురా.. ఊ క్విక్" అన్నాడు.

* * *

"మీరు కొంతసేపు అలాగే ఉండండి. ఆ తరువాత ఆఫీసుకొచ్చి డబ్బు తీసుకోండి. మీ రక్తానికి ఇచ్చే డబ్బు మీకు ఎంతవరకు ఉపయోగపడుతుందో తెలీదుకానీ, మీ రక్తం ఓ నిండు ప్రాణాన్ని కాపాడటానికి సహాయపడుతోంది. మీరు రాక ముందు బి- నెగెటివ్ గ్రూపు రక్తం దొరకక ఎంతో ఆందోళన చెందాము" డాక్టరు చెప్పాడు.

సహజ రక్తంతో నిండిన ప్లాస్టిక్ బాగ్ తీసి నర్సు చేతికందించి వెళ్ళాడు డాక్టరు.

అంతవరకూ బెడ్‌పై పడుకున్న సహజ మెల్లగా లేచి కూర్చుంది. 'రక్తం ఇవ్వడంవల్ల కళ్ళు తిరుగుతాయని నీరసం వస్తుందని విన్నాను. కానీ అలాంటిదేమీ కలగడం లేదే" అని ఆశ్చర్యంగా అనుకుంది.

"మీరు పక్క రూములో కూర్చోండి" అని నర్సు చెప్పగానే మెల్లగా నడుచుకుంటూ రూములో ఉన్న కుర్చీలో కూర్చుంది.

కాఫీ కప్పు సహజ చేతికిస్తూ "మీ రక్తంతో ఓ మనిషికి పునర్జన్మ ఇచ్చారు" అంటూ కృతజ్ఞతా పూర్వకంగా చూసింది నర్సు.

కాఫీ తాగిన తరువాత డబ్బు తీసుకొనడానికై ఆఫీసు రూముకెళుతున్న సహజ కాళ్ళను ఓ వయసుమళ్ళిన స్త్రీ గట్టిగా పట్టుకొని కన్నీటితో సహజ పాదాలను అభిషేకిస్తూ "అమ్మా! మీ రక్తం వల్ల మా కొడుకు ప్రాణ గండం నుండి బయటపడ్డాడు" అంది.

సహజ కంగారుపడుతూ ఆమెను లేవనెత్తి "చూడమ్మా! మీరు వయసులో పెద్దవారు. ఇలా చేయడం తప్పమ్మా" అంది.

పక్కన నిలబడ్డ అతను "అమ్మా, మా అబ్బాయికి ప్రమాదంలో బలమైన దెబ్బ తగిలి రక్తం ఎక్కువగా పోయింది. మా అబ్బాయికి కావలసిన గ్రూపు రక్తం కలవారు చాలా అరుదుగా ఉంటారట. ఎక్కడా దొరకక ఆందోళన పడుతున్న సమయాన మీరు దేవతలా వచ్చి..." కన్నీటితో రెండు చేతులూ జోడించాడు.

"మీరు రావడం ఆలశ్యమయివున్నా మా అబ్బాయి బతికేవాడు కాడట. ఏదో డబ్బుకోసం అవసరం కలిగి ఈ రక్తమివ్వడానికి వచ్చినట్లు డాక్టరన్నారు. మా డబ్బు కాపాడలేని కొడుకు ప్రాణాన్ని మీరు కాపాడారు. మీకెంత డబ్బు కావాలో నిర్మొహమాటంగా అడిగి తీసుకోండి" అంది ఆప్యాయతతో.

"నాకు డబ్బు అవసరం లేదండి" అంది సహజ.

"మా తృప్తికోసం అయినా తీసుకోమ్మా. మీకేదో అవసరం కలిగే ఇక్కడకు వచ్చినట్లుంది" అంటూ జేబులోనున్న వంద రూపాయల నోట్లు పది తీసి సహజకు అందించబోతుంటే "వద్దండీ, నేను నిజమే చెబుతున్నాను. నాకు డబ్బు అవసరం లేదు" అంది సహజ.

"ఆత్మాభిమానం కలదానివిలాగున్నావు. మీకు ఎటువంటి అవసరం కలిగి రక్తదానం చెయ్యడానికి ముందుకు వచ్చావో తెలిపితే నా చేతనయిన సహాయం చేస్తాను" అన్నాడు ప్రార్థనాపూర్వకంగా.

వారడిగిన ప్రశ్నకు ఎలా సమాధానం చెప్పాలా అని సతమతమవుతున్న సమయాన నర్సు వచ్చి ఆ దంపతులను చూస్తూ "మిమ్మల్ని డాక్టరుగారు పిలుస్తున్నారు" అని చెప్పి వెళ్ళింది.

ఒంటరిగా నిలబడ్డ సహజలో ఆలోచనలు. తానొక గొప్ప బిజినెస్ మాగ్నెట్ కూతురు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతోంది. స్నేహితురాండ్రతో పందెం కట్టడం, గెలవటం తన అలవాటు. గెలవడంలో ఏమాత్రం అనుమానం కలిగినా తను పందెం జోలికి వెళ్ళదు. ఇంతవరకు ఎప్పుడూ ఓటమి చవిచూడలేదు.

"మామూలు స్త్రీగా వెళ్ళి న్యాయమైన మార్గంలో ఎవరినీ మోసం చెయ్యకుండా రెండు గంటల్లోపున వంద రూపాయలు సంపాదించ గలవా?" అంటూ స్నేహితురాండ్రు ఛాలెంజ్ చేస్తే రక్తదానం ద్వారా సంపాదించవచ్చన్న ఆలోచన కలుగగానే సరేనంటూ తన దగ్గరున్న ఫారిన్ కెమెరా పందెం కట్టడం.

పందెంలో గెలవడం కోసం రక్తదానానికై వచ్చిన తనకు అనుకోని సంఘటన ఎదురు కావడం. రక్తదానం వల్ల ఎంతటి మహోన్నతమైన ప్రయోజనం అనుభవపూర్వకంగా తెలుసుకోవడం.

* * *


చివరకు సహజ ఓ నిర్ణయానికి వచ్చింది. "నన్ను ఓ గొప్ప వ్యక్తిగా, ప్రాణదాతగా హిమాలయమంత ఉన్నతంగా ఊహించుకుంటున్న ఆ దంపతులకు నేను రక్తదానం ఎందుకు చేయవలసి వచ్చిందోనన్న నిజాన్ని చెప్పడానికి సిగ్గుగా వుంది. అలాగని అబద్ధం చెప్పడానికి నా మనసంగీకరించడం లేదు. ఆ దంపతులు డాక్టరు దగ్గర నుండి వచ్చేలోగా హాస్పిటల్ వదిలి దూరంగా వెళ్లాలి" అని అనుకుంది.

అటుగా వెళ్తున్న నర్సును పిలిచి "నా రక్తదానం వల్ల హాస్పటల్ వారిచ్చే డబ్బుతో ఆ పేషెంటుకు పండ్లు కొనివ్వమని నేను చెప్పినట్లు ఆ డాక్టరుతో చెప్పండి. నాకు నిజంగా డబ్బు అవసరం లేదు" అని చెప్పి నర్సు పిలుస్తున్నా వినిపించుకోకుండా వేగంగా వెళ్ళిపోయింది సహజ.

సహజ మనసులో ఓటమి పొందానన్న భావన కలగడం లేదు. ఊహకందని మధురమైన ఓటమి.

నరనరాన తాను కోల్పోయిన రక్తం స్థానంలో ఏదో తెలియని వింత అనుభూతి ప్రవహింప సాగింది. *

## గోపురము - ఈగ



పూరీ జగన్నాథస్వామివారి
ప్రసాదంపై వాలి,
ఎగిరి ఆడే ఈగ
గోపురంతో చెప్పింది
"ప్రభూ తమరు జగన్నాథులవారి గోపురం
నేను కేవలం ఈగని
తమరికున్నది ఎత్తు, నాకున్నది చలనం
శతాబ్దాలుగా వేచివున్నా
తమరికింకా దర్శనం దొరకలేదు
కనీసం ఒకసారయినా ఒంగనైనా ఒంగలేని
తమ స్థితి నవ్వు తెప్పిస్తోంది
నాకు కంగారు తెప్పిస్తోంది
అనశ్వరతకి కొలమానము
నిశ్చలతయే నా
కేవలమొక క్షణము నా జీవితము
జగన్నాథుని కీర్తనల రాగం తీస్తూ
జగన్నాథుని గోవులకు, యాచకులకు మధ్య
జగన్నాథ రథము తోసి
నేను మోక్షం పొందుతాను
జంధ్యము, పుస్తకమూ లేకుండానే
కాలాతీతునికి మృత్యువు లేదు
మృత్యువు లేని వానికి మోక్షము లేదు

మలయాళ మూలం:
కె. సచ్చిదానందన్
తెలుగుసేత: ఎల్. ఆర్.స్వామి

